నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 3 జనవరి 2025 | ADILABAD NIRMAL

ఎస్సీ వర్గీకరణపై నేడు అభిప్రాయాల సేకరణ

నిర్మల్ చైన్‌గేట్/ఎదులాపురం, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణ కమిషన్, రాష్ట్ర హైకోర్ట్ రిటైర్డ్ న్యాయమూర్తి డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ నెల 3 న ఆదిలాబాద్ రానున్నట్లు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిలా పరిధిలో అభిప్రాయాలు, బహిరంగ విచారణ నిమిత్తం రానున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో అన్ని ఎస్సీ కులాల సంఘ ప్రతినిధులు, ప్రజలు వినతులు సమర్పించవచ్చని సూచించారు.

రిటైర్డ్ న్యాయమూర్తికి పూల మొక్క అందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

హైకోర్టు రిటైర్డ్ జడ్జికి స్వాగతం పలికిన అధికారులు

రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ గురువారం రాత్రి ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. పెన్‌గంగా గెస్ట్ హౌస్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

మంట కాగుతున్న ప్రజలు

పెరిగిన చలి తీవ్రత

● 8.4 డిగ్రీలు నమోదు ● ఒక్కరోజులో 7 డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. గురువారం జిల్లాలో ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్‌ధరిలో 8.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం జిల్లాలో 15.2 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా గురువారం 7 డిగ్రీలు తగ్గి 8.4గా నమోదైంది. జిల్లాలో పది రోజులుగా చలి ప్రభావం కనిపించలేదు. డిసెంబరు ప్రారంభం నుంచి చలి ప్రభావం ఎక్కువగా కనిపించింది. 17న జిల్లాలో అత్యల్పంగా 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తర్వాత మబ్బులతో కూడిన వాతావరణం కారణంగా చలి ప్రభావం తగ్గింది. పది రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో 13 నుంచి 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బేలలో 8.9 డిగ్రీలు, భీంపూర్ మండలం అర్లి (టీ), తాంసి, తలమడగు, జైనథ్, ఆదిలాబాద్ అర్బన్ మండలాల్లో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన చలి కారణంగా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చలి సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

భైంసాలో నిందితుల అరెస్టు చూపుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

న్యూ ఇయర్ విందు కోసం చోరీ

భైంసాలోని నాగదేవత ఆలయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

భైంసా, జనవరి, 2 : భైంసా పట్టణ శివారులోని నాగదేవత ఆలయంలో చోరీ కేసును 48 గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. నూతన సంవత్సర వేడుకల విందు కోసం చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం భైంసాలోని ఏఎస్పీ క్యాంప్ ఆఫీసులో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల వెల్లడించారు. భైంసా మండలం చుచుంద్ గ్రామానికి చెందిన విశాల్, సంఘరతన్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు డబ్బులు లేకపోవడంతో చోరీ చేయాలని పథకం చేశారు. ఇందులో భాగంగా నాగదేవత ఆలయం తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీ కానుకలతో పాటు గుడిలోని గంటలను చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల సమయంలో భైంసా పట్టణంలోకి ప్రవేశించే మార్గంలో సీసీ కెమెరాలన్నింటిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను గమనించారు. ఇందులో ఒకరి షర్ట్‌కు పసుపు కుంకుమ అంటినట్లుగా గుర్తించారు. అనుమానితుడిగా భావించి అతడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కొత్త సంవత్సరం వేడుకలకు చోరీ చేసినట్లు తేలడంతో వారిద్దరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 48 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, పట్టణ సీఐ గోపినాథ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

ఏడాదిలో ప్రజలకు మరింత చేరువయ్యాం

నమస్తే ఇంటర్వ్యూ

ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యల నివారణకే 'దత్తత'

● గంజాయికి యువతను దూరంగా ఉంచేందుకు పకడ్బందీ చర్యలు ● నిర్మల్, భైంసాలలో త్వరలోనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు
● నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల ● ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేక ఇంటర్వ్యూ

నిర్మల్, జనవరి 2(నమస్తే తెలంగాణ): 'నిర్మల్ పోలీస్-మీ పోలీస్' అనే నినాదంతో ప్రజలకు ఏడాది కాలంలో మరింత చేరువయ్యామని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. నిర్మల్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఈ నెల 4 నాటికి ఏడాది పూర్తి కావస్తున్నది. బాధ్యతలు చేపట్టి నాటి నుంచి ఓ వైపు నేరాలను అదుపు చేస్తూనే శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నారు. మరోవైపు సామాజిక కార్యక్రమాలతో గురుతర బాధ్యతను కొనసాగిస్తున్నారు. ఆర్థిక నేరాలతో పాటు కీలకమైన గంజాయి కేసులను ఛేదించి చూపారు. మత్తు పదార్థాల నుంచి యువతను దూరం చేసేందుకు గ్రామ గ్రామానా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల అదుపునకు ఎస్పీ తీసుకుంటున్న చర్యలు ప్రశంసలు అందుకుంటున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు నివారణకు ఆ క్యాంపస్‌ను దత్తత తీసుకొని కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆత్మస్థైర్యం పెంపొందించే చర్యలు తీసుకున్నారు. నిర్మల్, భైంసా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఎస్పీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఈ రెండు చోట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలను పంపించారు. భరోసా సెంటర్ ద్వారా ఇప్పటి వరకు దాదాపు 50 కుటుంబాలను ఏకం చేసి ఆ కుటుంబాల పిల్లల కళ్లల్లో ఆనందాన్ని చూశారు. జిల్లా పోలీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించి ఏడాదైన సందర్భంగా ఎస్పీ జానకీ షర్మిలతో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ చేసింది.

నమస్తే : బాధ్యతలు చేపట్టాక ఎలాంటి మార్పులు తీసుకొచ్చారు..?

ఎస్పీ: గత ఏడాదిగా పోలీసింగ్‌పై ప్రజలకు నమ్మకం పెరిగేలా చేయగలిగాము. పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరుగకపోతే నేరుగా ఎస్పీ దగ్గరికే వెళ్లవచ్చన్న విశ్వాసాన్ని ప్రజలకు కల్పించాం.

నమస్తే : నిర్మల్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు ..?

ఎస్పీ: ట్రాఫిక్‌కు సంబంధించి జిల్లాలోని నిర్మల్‌తో పాటు భైంసా పట్టణంలో రెండు చోట్ల ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాము. ఈ ఆర్థిక సంవత్సరం చివరలో మంజూరయ్యే అవకాశం ఉంది. ఆర్‌అండ్‌బీ ఈఈ, అడిషనల్ ఎస్పీ, మున్సిపల్ కమిషనర్‌లతో ప్రత్యేకంగా ఒక కమిటీని వేసి ట్రాఫిక్ సమస్య ఉండే ప్రాంతాలను గుర్తించాం. పలు చోట్ల ఆక్రమణలను తొలగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై త్వరలోనే సంయుక్తంగా నిర్ణయం తీసుకుంటాం.

నమస్తే: బాసర ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకోడానికి కారణం..?

ఎస్పీ: నేను జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా బాధ కలిగించింది. అందులో వ్యక్తిగత కారణాలతోనే ఎక్కువగా చనిపోతున్నట్లు గుర్తించాం. తమ సమస్యలను చెప్పుకునే వాతావరణం అక్కడ లేకపోవడంతో నిస్సహాయ స్థితిలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇక్కడ చదివే విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పేద కుటుంబాలకు చెందిన వారు. చదువులో మంచి ప్రతిభ ఉన్నవారు. పదవ తరగతిలో 10 జీపీఏ వచ్చిన వారికే ఇందులో అడ్మిషన్ దొరుకుతుంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సర్వీస్ కమిషన్ పరీక్షల్లో 200 మందికి పైగా ఇక్కడ చదివిన వారే సెలెక్ట్ అయ్యారు. ఇక్కడ చదివే విద్యార్థులందరినీ జాగ్రత్తగా కాపాడుకోవాలన్న ఆలోచన వచ్చింది. నేను కూడా బిడ్డను కోల్పోయాను. ఆ బాధ ఎలాంటిదో నాకు తెలుసు. ఎదిగిన పిల్లల్ని కోల్పోతే తల్లి దండ్రులకు ఎంతో బాధ ఉంటుంది. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకూడదన్న ఉద్దేశంతోనే ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకున్నాను.

నమస్తే: ఆత్మహత్యల నివారణకు తీసుకున్న చర్యలు..?

ఎస్పీ: వీసీ అనుమతితో బాసర్ ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకున్న తర్వాత విద్యార్థులకు రెగ్యులర్‌గా కౌన్సెలింగ్ చేస్తున్నాం. చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని మా వంతుగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నం. వారానికోసారి ట్రిపుల్ ఐటీకి వెళ్లి రెండు మూడు గంటల పాటు విద్యార్థులతో గడపడం వల్ల వారికి ఏమైనా ఇబ్బందులుంటే నేరుగా చెబుతున్నారు. అత్యవసర పరిస్థితిలో నేను మీకు అండగా ఉన్నాను అన్న భరోసా వారికి కల్పించగలిగాను.

నమస్తే: బాసర గోదావరి వంతెనపై తీసుకుంటున్న చర్యలు ?

ఎస్పీ: బాసర గోదావరి వద్ద సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తున్నాము. అలాగే అక్కడే పోలీసు పికెటింగ్ కూడా ఏర్పాటు చేశాం. గత పది రోజుల్లో ముగ్గురికి కౌన్సెలింగ్ నిర్వహించాం. నిర్మల్, నిజామాబాద్ సరిహద్దులో ఈ వంతెన ఉన్నందున నిజామాబాద్ పోలీసుల సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. వంతెనకు ఇరువైపులా ఉన్న రేలింగ్‌పై ఇనుప జాలీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నమస్తే: భరోసా సెంటర్ల ద్వారా మహిళలకు అందే సాయం..?

ఎస్పీ: జిల్లాలో ఇప్పటి వరకు వివిధ కారణాలతో గొడవపడి విడిపోయిన 50కి పైగా కుటుంబాలను ఈ భరోసా సెంటర్ ద్వారా ఏకం చేశాం. కుటుంబం అనేది సమాజంలో ఒక భాగం. కుటుంబ వాతావరణం బాగా లేకపోతే వాటి ప్రభావం పిల్లలపై పడుతుంది. వారు చెడు మార్గం వైపు వెళ్లే అవకాశం ఉంటుంది. పిల్లలు చేసే నేరాలను పరిశీలిస్తే.. చాలా వరకు వారి తల్లి దండ్రులు విడిపోయిన వారే కనిపిస్తారు. అందుకే దీనిపై ప్రత్యేక దృష్టి సారించాము. కుటుంబాలు బాగుంటేనే చక్కని సమాజం నిర్మితమవుతుంది. ఒక మహిళగా, తల్లిగా ఈ బాధ్యతను తీసుకోవడం నాకు ఎంతో సంతృప్తిని ఇస్తున్నది.

నమస్తే: సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి కారణం..?

ఎస్పీ: పోలీసు శాఖపై నమ్మకం పెంచేందుకోసం సామాజిక కార్యక్రమాలు మరింతగా దోహదపడుతాయన్న భావనతోనే ఆ దిశగా దృష్టి సారిస్తున్నాను.

నమస్తే: చివరగా జిల్లా ప్రజలకు మీరిచ్చే సూచన..?

ఎస్పీ: నిర్మల్ పోలీస్ మీ పోలీస్

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఎదులాపురం,జనవరి 2: కుమ్రం భీం కాలనీలోని ఆదివాసుల ఇండ్లకు గృహ జ్యోతి పథకం ద్వారా వెంటనే విద్యుత్ సౌకర్యంతో పాటు నీళ్లు, విద్య, వైద్య వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు ఆదివాసులు ర్యాలీ తీశారు. విద్యుత్ బల్బులు పట్టుకొని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పోలీసులు అక్కడి చేరుకొని బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ జిల్లా కేంద్రం చుట్టూ కరెంటు ఉన్నది కానీ, కుమ్రం భీం కాలనీలోని ఆదివాసుల ఇండ్లకు కరెంటు లేదన్నారు. తమపై వివక్ష ఎందుకు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గృహ జ్యోతి పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించాలని, లేదంటే హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వేల మంది ఆదివాసులతో వెళ్లి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సలాం వరుణ్, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత బాయి, డివిజన్ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, ఆత్రం భుజంగ రావు, మేస్రం తులసీరాం, వెడ్మ ముకుంద్ రావు ఉన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్‌ఎదుట ధర్నాచేస్తున్న కుమ్రం భీం కాలనీవాసులు

రక్తదానం చేస్తున్న మహిళలను అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

రక్తదానం చేసి ప్రాణదాతలవ్వాలి

ఇంద్రవెల్లి, జనవరి 2 : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని యువతకు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఇంద్రవెల్లి మండలంలోని పిట్టబొంగురం గ్రామానికి చెందిన నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాతోపాటు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువత వ్యసనాలతో పాటు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, డీఎంహెచ్ రాథోడ్ నరేందర్, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల ఫొటోలతో నిరసన

ఎదులాపురం, జనవరి 2: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ఫొటోలను ముఖానికి ధరించి నిరసన తెలిపారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమ్మెలో భాగంగా నిరసన ర్యాలీ తీశారు. సీఎం, మంత్రుల ఫొటోలతో ఉన్న మాస్కులు ధరించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. రెగ్యులర్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించారని మండిపడ్డారు. 24 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేపడుతున్నామని, బోధన అందక విద్యార్థులు నష్టపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను రెగ్యులర్ చేసే వరకూ ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి. ధరమ్ సింగ్, వెంకటి, పార్థసారథి, శ్రీకాంత్, ప్రవీణ్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోలా పని చేస్తున్నాం..

నిర్మల్ అర్బన్, జనవరి 2 : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 24 గంటల పాటు రోబోలాగా విధులు నిర్వహిస్తున్నామని తెలుపుతూ గురువారం నిర్మల్‌లో ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, సమగ్ర శిక్ష ఉద్యోగికి ముఖాముఖిగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న 20 ప్రశ్నలపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నవిత, వీణా, అపర్ణ, పుష్పలత, రాధిక, శ్రీలత, గంగామణి, ప్రభ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అస్వస్థత..

దీక్ష శిబిరంలో మామడ మండల కేజీబీవీ సీఆర్టీ ఉపాధ్యాయురాలు పద్మ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన తోటి ఉపాధ్యాయులు ఆమెను హుటాహుటిన నిర్మల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. సమ్మెలో పాల్గొంటున్న ఉపాధ్యాయుల ఆరోగ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్మల్‌లో రోబోతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌లో సీఎం, మంత్రుల ఫొటోలు ముఖానికి పెట్టుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

బోథ్, జనవరి 2 : ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం మండలాధ్యక్షుడు ఎన్ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మార్కెట్ కమిటీ యార్డులోని షెడ్డు కింద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీవోఏలకు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలన్నారు. అనంతరం వీవోఏల సంఘం జేఏసీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్ స్వామి, కార్యదర్శిగా ఎం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వప్న, కోశాధికారిగా రంజిత్ కుమార్, సహాయ కార్యదర్శిగా మధుసూదన్ ఎన్నికయ్యారు. వీరితోపాటు సొనాల మండల కమిటీ అధ్యక్షుడిగా పవర్ శ్యాంరావ్, కార్యదర్శిగా బత్తుల రవీందర్, సహాయ కార్యదర్శిగా సంగ్రామ్, కోశాధికారిగా నాగరాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాణిక్‌రావ్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఏం అవ్వా..పింఛన్ వస్తుందా..?

బీడీ కార్మికులను పలకరించిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్‌అనిల్

నేరడిగొండ, జనవరి 2 : ఏం అవ్వా...కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎట్లుంది..? ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 4000 రూపాయల పింఛన్ వస్తుందా..? అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ బీడీ కార్మికులను ప్రశ్నించారు. గురువారం మండలంలోని కుమారి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో బీడీలు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారిని సరదాగా పలకరించారు. బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రూ.4000 పింఛన్ వస్తుందా ? అని అడిగారు. వారు రావడం లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. 'కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అని..అప్పుడు ఇచ్చిన రూ.2000 లే ఇస్తున్నారని.. మాకు రూ.4000ల పింఛన్ ఇప్పించండి సారూ..' అని బీడీకార్మికులు ఎమ్మెల్యేకు విన్నవించారు.

కేసీఆర్ పార్కులో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

మండలంలోని కుప్టి గ్రామంలోని కేసీఆర్ పార్కులో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మొక్కలు నాటారు. తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త కొయ్యడి గంగయ్య ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కుమారి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కమలాకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని పరామర్శించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, మాజీ సర్పంచ్ పాండురంగ్, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

దళారుల దందాను అరికట్టాలి

ఎదులాపురం, జనవరి 2: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దళారుల దందాలు అరికట్టాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న కోరారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి సీసీఐకి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారన్నారు. అమాయక రైతుల పట్టాలను తీసుకొని దళారులు పేరిట అమ్ముతున్నారని పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు పత్తి కొనుగోలు పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటివరకు జరిగిన సీసీఐ పత్తి కొనుగోలుపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.